క్లుప్తంగా

కూరగాయల మార్కెట్‌ను పరిశీలించిన ఆమంచి

మార్టూరు: నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ శుక్రవారం మార్టూరులో పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి రైతులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక సుగాలి తండాలో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన ఆయన నాయకుల సూచనల మేరకు కాలువ నిర్మాణానికి ఎన్నికల అనంతరం తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకులకు గాయాలు

అద్దంకి రూరల్: బైక్ మీద వెళ్తున్న ముగ్గురి యువకులకు ట్రాక్టర్ తగలటంతో గాయాలయ్యాయి. ఈఘటన అద్దంకి సమీపంలోని బొమ్మనంపాడు రోడ్డులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు అద్దంకి కొత్తపేటకు చెందిన రాజశేఖర్, ధీరజ్, మృత్యుంజయచారి ముగ్గురు స్నేహితులు బైక్‌పై బయలుదేరారు. కాకాని పాలెం- బొమ్మనంపాడు రోడ్డులో మధ్యాహ్నం ఫోను పోగొట్టుకున్నారు. దానిని వెతికేందుకు మరలా సాయంత్రం ముగ్గురు కలిసి ఆదే ప్రాంతానికి బైకు మీద వెళ్లారు. చీకటి పడటంతో తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ తగటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో బైకు నడుపుతున్న రాజశేఖర్ చేతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో అద్దంకి 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు

బల్లికురవ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని బల్లికురవ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జీ. సీతామహాలక్ష్మీ ఓటర్లకు సూచించారు. శుక్రవారం బల్లికురవలో పలు వాహనాలను ఆమె పోలీసులతో కలిసి తనిఖీ చేశారు. డబ్బు, మద్యం తరలిస్తే వాహనాలను సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించ్చారు. ఏఎస్సై సీ. బాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవలో 1173 మంది ఓటర్లు..

మార్చి 13 తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు 139 మంది ఉపాధ్యాయులు, 34 మంది గ్రాడ్యుయేట్లు ఓటు హక్కు పొందారని తహసీల్దార్ పీ. సీతారత్నం శుక్రవారం తెలిపారు. బల్లికురవ ఉన్నత పాఠశాలలో కేటాయించిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

ముస్లింల సమావేశం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లింలు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం మసీదు వద్ద ముస్లింల ఆత్మీయ సమావేశం వాల్‌పోస్టర్‌ను ముస్లిం సంక్షేమ సంఘం ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు సర్దార్‌ఖాన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన ఒంగోలులో రాష్ట్ర సంక్షేమ సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ముస్లింల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మసీద్ ఇమామ్, రసూల్, అజీమ్, హుస్సేన్, అబ్దుల్ ఖాన్ పాల్గొన్నారు.

బస్టాండ్‌ను సందర్శించిన డిపో మేనేజర్

చినగంజాం: ఇంకొల్లు బస్టాండును శుక్రవారం ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు సందర్శించారు. ఒంగోలు నుంచి పర్చూరు, గుంటూరు, విజయవాడ మీదుగా బీహెచ్‌ఈఎల్‌కు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు అన్నంబొట్ల మోహన కృష్ణశాస్త్రి ఇటీవల వినతి పత్రం అందజేయడంతో ఆయన పరిశీలించేందుకు వచ్చారు. పరిశీలనలో భాగంగా ఆయన ఇంకొల్లు బస్టాండ్‌ను దర్శించి బస్టాండులోని ప్రయాణికులను కలిసి ఆయన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టికెట్ ఇన్‌స్పెక్టర్‌లు టీఎస్ ఆచార్యులు, కంట్రోలర్ బాబు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

పర్చూరు: ఎమ్మెల్సీ ఎన్నికలు జరగబోయే పోలింగ్ కేంద్రాలను బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం గుంటూరులో రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. మద్యం, డబ్బు వెళ్లకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డీఎస్పీ వెంట మార్టూరు సీఐ ఫిరోజ్, ఎస్సై చెంచుప్రసాద్ ఉన్నారు.



పంగులూరు నుంచి ఆరికట్లవారిపాలెం రహదారిలోని మలుపు



చందలూరు నుంచి పంగులూరు రహదారి మధ్యలో ఉన్న మలుపు

సూచికలు లేక.. ప్రమాదాలు ఆగక

- నియోజకవర్గ వ్యాప్తంగా 124 మలుపులు
- ప్రమాదాల్లో క్షతగాత్రులుగా మిగులుతున్న ప్రయాణికులు
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి
- పట్టించుకోని సంబంధితశాఖ అధికారులు

జే.పంగులూరు: ఎద్దైనా ప్రమాదం జరిగితే తప్ప అధికారులు మేల్కోవడం లేదు. కనీసం వాటి నివారణకు పూనుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలోని రహదారుల్లో ఉన్న వందల సంఖ్యలోని మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఎక్కడ ఏ మలుపుందో స్థానిక ప్రజలకు తెలిసినా కొత్త వారికి తెలియపోవడంతో రోడ్డు ప్రమాదాలకు అవి రాచబాటలుగా మారుతున్నాయి. మలుపు ఉందనే సూచిక బోర్డు కూడా లేకపోవడం, రెండు వైపులా చిల్ల చెట్లు పెరిగి ఉండడంతో, రాత్రి సమయాల్లో వాహనాలను డ్రైవర్లకు మరింత ఇబ్బందికరంగా మారాయి.

124 మలుపులకుపై మాటే...

నియోజకవర్గంలోని అద్దంకి, పంగులూరు, కొరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని 103 గ్రామాలను తీసుకుంటే, దాదాపు 124 మలుపుల కుపై మాటగానే ఉన్నాయి. జే పంగులూరు మండలంలోని ముప్పవరం నుంచి ఇంకొల్లుకు వెళ్లే రోడ్డు మార్గంలో 16 కిలో మీటర్లు పొడవులోనే 6 ప్రమాదకర మలుపులు ఉన్నాయి. మలుపుల్లో ఒక్క చోట కూడా అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఈ మార్గం వెంబడి రాత్రి సమయాల్లో ప్రయాణించే వాహనదారులు తరచు ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఈ మార్గం జాతీయ రహదారిని కలుపుతుండటంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ఇక రాత్రి సమయాల్లో మార్గం గుండా ఇంకొల్లు నుంచి భారీ వాహనాలు వస్తుంటాయి. మేదరమెట్ల మండలం కొరిశపాడు నుంచి కుర్రవానిపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో 12 మలుపులున్నాయి. దీంతోపాటు, దైవాలరావూరు, బొల్లవరప్పాడు మలుపులున్నాయి.

➤ఆరికట్లవారిపాలెం నుంచి పంగులూరు, చందలూరు నుంచి పంగులూరు మధ్యలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల్లో గతేడాది చందలూరు గ్రామం నుంచి పంగులూరు వస్తున్న కారు మలుపు వద్ద ప్రమాదానికి గురై కారులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రగాయాలపాలయ్యారు. పంగులూరు నుంచి ఆరికట్లవారిపాలెంలో మలుపు వద్ద కూలీల ఆటో తిరగబడటంతో పలువురికి గాయాలయ్యాయి. కొండమంజులూరు నుంచి కల్లంవారిపాలెం వైపు మలుపు వద్ద కూలీల ఆటో బోల్తా పడి ఒక కూలీ మృతి చెందారు.

అద్దంకి మండలంలో..

మండలంలోని మైలవరం నుంచి ఉప్పలపాడు, అద్దంకి నుంచి నాగులపాడు నుంచి వెంకటాపురం, కంకుపాడు నుంచి మోదేపల్లి, మిట్లపల్లి నుంచి కొటికలపూడి, గోపాలపురం వద్ద అద్దంకి నుంచి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని మలుపు పలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు నుంచి అడవిపాలెం వరకు మూడు కిలోమీటర్ల రహదారిలో 14 మలుపులున్నాయి. మక్కెనవారిపాలెం-కొమ్మాలపాడు రహదారిలో ఒక మలుపు, కొప్పరం నుంచి సజ్జాపురం మూడు కిలో మీటర్లలో రెండు మలుపులున్నాయి. అడవిపాలెం వద్ద 2013లో ట్రాక్టర్ ఢీ కొని ఇద్దరు యువకులు మరణించారు. రహదారుల్లో సంబంధిత శాఖ అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ఆరికట్లవారిపాలెం మధ్యలో మలుపుల వద్ద ప్రమాదానికి గురైన కారు, ట్రాక్టర్ (ఫైల్)

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- చీరాల ఆర్డీవో సరోజిని



మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో సరోజిని

చీరాల టౌన్: ఎన్నికల సంఘం ఆదేశాలతో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పటిష్టంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని ఏఆర్వో, చీరాల ఆర్డీవో పీ సరోజిని తెలిపారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మార్చి 13న జరగనున్న ఎన్నికలకు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉంటుందని, ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో రెండు పోలింగ్ కేంద్రాల చొప్పున 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 13 మండలాల్లో పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి 27 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎన్నికకు 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. చీరాల, వేటపాలెం, అద్దంకి మండలాలకు మాత్రమే మండలానికి మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చీరాల మండలానికి ఎస్‌ఆర్‌అండ్ పీఎం హైస్కూల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను కేంద్రాలుగా ఎంపిక చేశామన్నారు. వేటపాలెం మండలంలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన ప్రభుత్వ ఉద్యోగులకు, పోలింగ్ ఆఫీసర్లు, స్క్వాడ్ అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వహించేలా పరిశీలనలు చేస్తున్నామని ఆర్డీవో తెలిపారు.

27న ప్రత్యేక అవసరాల పిల్లలకు స్క్రీనింగ్ క్యాంప్

చీరాల అర్బన్: సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఈనెల 27న ప్రత్యేక అవసరాల గల పిల్లలకు మెడికల్ అస్సెస్మెంట్ స్క్రీనింగ్ క్యాంప్ చీరాల మండలంలోని భవిత కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో డీ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. క్యాంప్‌నకు చీరాల, వేటపాలెం మండలాల్లోని 6 నుంచి 16 ఏళ్లలోపు విద్యార్థులు హాజరుకావాలన్నారు. ప్రత్యేక వైద్యులు వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వినికిడి లోపం ఉన్న వారికి వినికిడి యంత్రాలు, శారీరక వైకల్యం ఉన్నవారికి వీల్ చైర్స్, ట్రైసైకిళ్లు, రోటవేటర్స్, బుద్ధిమాంద్యత ఉన్నవారికి ఎంఆర్ కిట్స్ ఉపకరణాలు అందిస్తారన్నారు. క్యాంప్‌నకు వచ్చేవారు సదరం ద్వారా తీసుకున్న వైకల్యం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్, రైస్ కార్డు జిరాక్స్, కుల ధ్రువీకరణపత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు.

28న కారంచేడులో స్క్రీనింగ్ క్యాంప్..

కారంచేడు: ఈనెల 28వ తేదీన ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నిర్వహించే మెడికల్ ఎస్సెస్మెంట్ స్క్రీనింగ్ క్యాంప్ పర్చూరు ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని భవిత కేంద్రంలో శిబిరం ఉంటుందని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ, ఐఈఆర్‌టీలు జీ వసంతబాబు, వి విజయకుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారం కోసం 79811 44355, 91009 96460 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

గూటన్ బర్గ్ చిరస్మరణీయుడు



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రింటింగ్, బైండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల అర్బన్: ముద్రణారంగంలో రోజురోజుకూ వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వృద్ధిలోకి రావాలని పలువురు వక్తలు అన్నారు. ముద్రణా యంత్రం కనుగొన్న పితామహుడు జోహెనెస్ గూటన్‌బర్గ్ జయంతి (ప్రింటర్స్ డే) వేడుకలు శుక్రవారం పట్టణంలోని ప్రింటింగ్, డీటీపీ, బైండర్స్, ఫ్లెక్స్ ప్రింటింగ్ కేంద్రాల నిర్వాహకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రవిపార్శిల్ రోడ్డులో వారు ప్రింటర్స్‌డే జెండా ఆవిష్కరించి గూటన్ బర్గ్ చిత్రపటాన్ని పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం రోటరీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన సభలో ముద్రణారంగంలో అనువభవజ్ఞులైన పలువురు ఈ సందర్భంగా మాట్లాడుతూ ముద్రణారంగంలో పనిచేసే వారు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ముద్రణా రంగంలో ఎంతో కాలంగా సేవలందిస్తున్న వేములకొండ సుబ్బారావు, కంతేటి శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించి అసోసియేషన్ తరుపున ఒక్కొక్కరికి రూ.3,116 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు నందం కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ షేక్ మీరావలి, సెక్రటరీ వెన్నూరి అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీ అందె నరసింహారావు, ట్రెజరర్ గుండపు గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు, శ్రీనివాసరావు, వూటుకూరి రాజేష్, అక్కల వెంకటేశ్వర్లు, నక్కల శ్రీనివాసరావు, ముద్రణాలయాల నిర్వాహకులు, ఆపరేటర్లు, సిబ్బంది ఉన్నారు.

పార్టీలో పలువురికి కీలక పదవులు



ఎన్ రాజ్‌కుమార్



చీమకుర్తి బాలకృష్ణ



సల్లూరి అనిల్



లేళ్ల శ్రీధర్

చీరాల: వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ సంఘ విభాగాల అధ్యక్షులుగా చీరాల నియోజకవర్గానికి చెందిన నలుగురు నియమితులయ్యారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నల్లబోతుల రాజ్‌కుమార్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా చీరాల మున్సిపల్ కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ నియమితులయ్యారు. అలానే వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులుగా సల్లూరి అనిల్, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులుగా లేళ్ల శ్రీధర్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నిమితులైన వారు శుక్రవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లను కలిశారు. ఆయా విభాగాల్లో సమర్థవంతంగా పనిచేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని వారికి సూచించారు.

అంబడిపూడిలో పిచ్చి కుక్కల స్వైర విహారం



కుక్కదాడిలో గాయాపాలైన కనకరత్నం

బల్లికురవ: మండలంలోని పెద అంబడిపూడి, చిన అంబడిపూడి గ్రామాల్లో మూడు నెలలుగా పిచ్చికుక్కల స్వైర విహారంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇంట్లోనుంచి బయటకు రావాలంటేనే భయాందోళన చెందుతున్నారు. 3 నెలల క్రితం ఎస్సీ కాలనీకి చెందిన 8 మందిపై కుక్కలు దాడి చేయటంతో గాయాలపాలై నేటికి వైద్యశాలల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. తాజాగా శుక్రవారం సాయంత్రం ఎస్సీ కాలనీకి చెందిన అంబటి కనకరత్నం గ్రామంలోకి రాగా పిచ్చి కుక్క వెంటబడి కాళ్లు చేతులను తీవ్రంగా గాయపరిచింది. రక్త గాయాలైన కనకరత్నాన్ని వైద్యం కోసం చిలకలూరిపేట తీసుకెళ్లారు. మరో ఇద్దరిని కూడా కరిచేందుకు వెంటబడగా తప్పించుకుని ఇళ్లల్లోకి పారిపోయారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కుక్కల స్వైర విహారానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుచేయాలి

చీరాల రూరల్: అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుచేసి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. తెలంగాణలోని నల్గొండ కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న సారపాక నరేందర్ అనే న్యాయవాదిని కొందరు దుండగులు హతమార్చినందుకు నిరసనగా శుక్రవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాగంటి జ్ఞానేశ్వరరావు, నీలి కస్తూరినాథ్‌లు మాట్లాడుతూ న్యాయవాదులు తమ కక్షిదారులకు న్యాయ సాయమందించేందుకు ఎంతో కష్టపడుతుంటారని అటువంటి వారిపై దాడులు చేయడం, వారిని హత్యలు చేయడం మంచి పద్ధతి కాదని వారు హితవు పలికారు. న్యాయవాదులు విధులు బహిష్కరించడంతో అత్యవసర వాదనలు మినహా రోజువారి కోర్టుల్లో విధులు మాత్రం నిలిచిపోయాయి. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

పేదల కోసం సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న చైర్మన్ అనీల్‌కుమార్

చీరాల టౌన్: తల్లిదండ్రుల ఆదేశాలు, పూర్వీకుల ఆలోచనలతో జీవితాంతం పేద ప్రజల సంక్షేమం, పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని పద్మ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనీల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని విఠల్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పద్మ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫిలిప్పీన్స్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ జాన్ రాధా, విశ్రాంత అధ్యాపకుడు వీ.పూర్ణచంద్రరావు, ఘంటా రాజేంద్రప్రసాద్, మేజర్ తోట రోశయ్యలు హాజరయ్యారు. వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ కళాశాల పాలకవర్గ సభ్యులు ఘంటా అనీల్‌కుమార్ గత ఎనిమిదేళ్లుగా తమ పూర్వీకుల పేరు మీద ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు పేదలకు ఆర్థిక సాయం అందించారు.

నలుగురు జూదరుల అరెస్టు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు జోగన్నగారి వీధిలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం అనిత తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. వారి నుంచి రూ.9660 నగదు స్వాధీనం చేసుకుకుని, కోర్టుకు హాజరుపరిచామని పోలీసులు చెప్పారు.

సమష్టిగా పనిచేస్తే మళ్లీ మనమే గెలుస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం, వేదికపై ఇన్‌చార్జి వెంకటేష్

- చీరాల ఎమ్మెల్యే కరణం, ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల టౌన్: ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా ఎన్నుకుంటేనే అన్నీ వర్గాల ప్రజలు వృద్ధి చెందుతారని, అందుకు గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు సూచించారు. శుక్రవారం మండలంలోని రామకృష్ణాపురంలో చీరాల మండలంలోని గ్రామాల్లో ఎంపికైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ఇన్‌చార్జి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంగా 2019లో పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ రాష్ట్రాభివృద్ధితో పాటుగా పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్ మాట్లాడుతూ పరిపాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి అన్నీ ప్రాంతాలు, వర్గాల అభివృద్ధికి జగన్ పనిచేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు చేయాల్సిన విధులను వివరించి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ప్రముఖ వైద్యుడు గుంటుపల్లి హైమా సుబ్బారావు, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ బి.కేశవులు, ఆర్‌బీకే చైర్మన్ కె.రమణారెడ్డి, పి.శ్రీనివాసరావు, బిట్రా శ్రీనివాసరావు, మచ్చా సువార్త, బి.సాంబశివరావు, బి.శివప్రసాద్‌రెడ్డి, డి.జయరావు, మస్తాన్, ఎన్.కోటేశ్వరరావు, వాసు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీలోని వివిధ విభాగాల నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గరటయ్య జన్మదిన వేడుకలు



మేదరమెట్లలో కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గరటయ్య

మేదరమెట్ల/అద్దంకి రూరల్: జిల్లా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మేదరమెట్ల పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గరటయ్య కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అద్దంకి మండల పార్టీ కన్వీనర్ జ్యోతి హనుమంతరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో గరటయ్య పుట్టినరోజు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు కుంచా శ్రీనివాసరావు, పట్టణ సచివాలయ కన్వీనర్ కిషోర్‌బాబు, పాదయాత్ర రోశయ్య, బబ్బూరి వెంకట రమణయ్య, సగ్గం అంజయ్య, ఉబ్బతోటి వెంకన్నరావు పాల్గొన్నారు. శింగరకొండలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన చైర్మన్ నర్రావుల ఏడుకొండలు కార్యాలయంల గరటయ్య పుట్టినరోజు కేక్ కట్ చేశారు. నాయకులు పూనూరి నరేంద్ర, గునుపూడి రఘురామగుప్తా, పాఠశాల చైర్మన్ పేరం సుధాకరరెడ్డి, అంజిరెడ్డి, రోశయ్య పాల్గొన్నారు.

గృహసారథులే గ్రామాభివృద్ధికి వారధులు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

- శాప్ నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య

జే.పంగులూరు: గృహసారథులు, సచివాలయ కన్వీనర్లే గ్రామాభివృద్ధికి వారధులని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, ఏపీ శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధిలోని పంగులూరు టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం మండలంలోని 21 గ్రామాల గృహసారథులు, కన్వీనర్ల శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ గృహసారథులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనితీరును అవగాహన చేసుకొని సమయపాలనతో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లి నిర్వహించాలన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందించటంలో వలంటీర్లు నూటికి నూరు శాతం సఫలీకృతులయ్యారన్నారు. సంక్షేమ పథకాలను వివరించి, అందనిరారికి అందించే విధంగా ముందుకు సాగాలన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ రఘురామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సేవాదళం అధ్యక్షుడు పులికం కోటిరెడ్డి, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు జంపాని రవి, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జెడ్పీటీసీ రాయిని ప్రమీళ, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు, ఎస్సీ సెల్ కన్వీనర్ సందిపోగు రవీంద్ర, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సురేష్, డీలర్స్ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరావు, పంగులూరు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, రామారావు, ఎంపీటీసీ నూతలపాడు రాములు, మాజీ ఏఎంసీ అధ్యక్షులు భువనేశ్వరి, మండల ప్రచార కమిటీ అధ్యక్షులు ఎల్వీ కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వీరాంజినేయులు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 18న లోక్ అదాలత్

అద్దంకి: స్థానిక కోర్టు సముదాయంలో మార్చి 18వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ బాబూనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో కుటుంబ తరహా కేసులు, అంటీ మనోవర్తి, గృహహింస, భార్యభర్తల కేసులు, వినియోగదారుల కేసులను పరిష్కరిస్తారని చెప్పారు. అవకాశాన్ని అద్దంకి, బల్లికురవ, జే పంగులూరు, కొరిశపాడు, మార్టూరు, సంతమాగులూరు మండలాల్లోని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.